# 'నాన్న' గారి 'రమణ' వాణి



'అమ్మ' అంటే అనురాగం, మమకారం. అమ్మ ఒడిలో ఆప్యాయత, ప్రేమ ఉన్నాయి. మరి నాన్న. పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లు సమీపంలో ఓ కుగ్రామం జిన్నూరు. ఆ ఊరిలో ఓ న్నాగారు. వారు ఏ ఇంటి గడప దాటినా ప్రేమానురాగాలు చోలు చేసుకొంటాయి. వారి అమృత వాక్కులకై భక్తులు చకోరపక్షులలా ఎదురుచూస్తారు. ఈనాడు దేశంలో రమణ తత్వాన్ని చిలుకపలుకులలా, జున్నులా తీయగా అందిస్తున్నారు జున్నూరు వాసి 'నాన్నగారు'.

**ముద్దుతో జ్ఞానోదయం :**

ఓ సాధారణ సీదా, సాదా వ్యవసాయ కుటుంబంలో 23-09-1934లో జున్నూరు గ్రామంలో నాన్నగారు జన్మించారు. 1957లో ఓ రాత్రి, నాన్నగారికి స్వప్నంలో ఓ వృద్ధుడు, వీరిని మంచం మీద నుంచి తీసి మూడు సార్లు కుడి బుగ్గ మీద ముద్దు పెట్టుకుంటే భయం కలిగి విడిచిపెట్ట మన్నారు. తర్వాత తలగడ జారిపోతే మంచం మీద ఆ వృద్ధుడు సరిగా పెట్టారు. తర్వాత మంచం మీద నాన్నగారిని పడుకోపెట్టి ప్రస్తుతానికి ఇది చాలులే అన్నారు. నాన్నగారికి ఆ వృద్ధ వ్యక్తి ఎవరో బోధపడలేదు. ఓరోజు జున్నూరు గ్రామంలోని లైబ్రరీలో హిందూ పత్రిక తిరగేస్తుంటే మద్రాసు బుక్‌పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన గ్రేట్ మెన్ ఆఫ్ ఇండియా గురించి పుస్తక సమీక్ష చదువుతుంటే, దానిలో ఏడవ వ్యక్తి శ్రీ రమణ మహర్షి. 'అరె! వీరిని ఎక్కడో చూసినట్లుందే!' అని ఒళ్లు జలదరించింది. వీరెవరో కాదు, ఆరోజు స్వప్నంలో ముద్దులిడిన వ్యక్తే. తర్వాత మద్రాసు పబ్లిషింగ్ హౌస్ వారికి వ్రాసి పోస్టులో పుస్తకం తెప్పించుకున్నారు. ఆ అరుణాచల దివ్య క్షేత్రంలో జనవరి 1959లో అడుగు పె



ట్టారు. ఆ అయస్కాంత శక్తితో, ఇప్పుడు భక్త జనావళికి రమణ బోధనలను పనస తొనలలా, జున్నూరు 'జున్ను'లా, ఊరూరా, ఇంటింటా, విదేశాలలో సైతం రమణవాణిని లోకానికి చాటి చెప్పతున్నారు. వీరి అసలు పేరు భూపతిరాజు వెంకటలక్ష్మీనరసింహ రాజు, పలు గ్రామాలలో అన్నప్రాశనలు, గృహప్రవేశాలు, పెళ్లిళ్లు - ఇలా పలు కార్యక్రమాలలో పాలుపంచుకొంటూ 'రమణ ధార'ను సత్సంగాలలో ప్రసరిస్తూ ఎంతో మందికి తలలో నాలుకలా, మరెంతో మందికి తీయని మాటలతో దుఃఖాన్ని పారద్రోలుతున్నారు. వీరి మధ్య హైదరాబాద్ వచ్చినప్పుడు తమదైన బాణిలో సమాధానాలిచ్చారు.

**ప్ర: జున్నూరు కుగ్రామం నుండి విదేశాలలో రమణవాణిని వినిపించిన తీరును వివరిస్తారా?**

జ: లండన్ రమణ మహర్షి ఫౌండేషన్ ఆహ్వానం మేరకు రెండు సార్లు పర్యటించాను. అక్కడ నన్ను క్రౌడ్ పుల్లర్ అని పత్రికలు చాటాయి. రమణమహర్షి బోధనలు వారిని ఎంతో ఆకట్టుకున్నాయి. ఆ దేశవాసుల దేశభక్తి, చదువులపై శ్రద్ధ, పరిశుభ్రత నన్ను ఆకట్టుకున్నాయి.

**ప్ర: జున్నూరులో ఆంధ్రాశ్రమం స్థాపన ఎప్పుడు జరిగింది? అరుణాచలంలో నాన్నగారి ఆశ్రమం ఎప్పుడు ప్రారంభించారు?**

జ: జున్నూరులో 1994లోనూ, అరుణాచలంలో నాన్నగారి ఆశ్రమం 1999లోనూ

ప్రారంభాలు జరిగాయి. అరుణాచలంలో భక్తులకు వసతిసౌకర్యాల కోసం వారే నిర్మించుకున్నారు.

**ప్ర: కేవలం సత్సంగాలకే పరిమితం కాకుండా వేరే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?**

జ: రమణ సత్సంగాల ద్వారా అన్యోన్యత ఏర్పడుతుంది. సందేహాలకు సమాధానం దొరుకుతుంది. మనస్సులోని ఆందోళనలు దూరం అవుతాయి. శాంతి చేకూరుతుంది. నాన్నగారి చారిటబుల్ ట్రస్ట్ స్థాపన 2001లో జరిగింది. దీని ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాం. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, వృద్ధులకు పెన్షన్లు, రోగులకు చికిత్స, గుండె జబ్బుల వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహణ, కమ్యూనిటీ హాల్స్, విద్యా సంస్థల నిర్వహణ - ఇలా పలు కార్యక్రమాలు చేపట్టాం.

**ప్ర: పలు ప్రాంతాలలోని సత్సంగాలలో స్త్రీలే ఎక్కువ పాల్గొంటున్నారు. యువత, పురుషులు నామమాత్రంగా ఉండటానికి కారణం?**

జ: అనేక చోట్ల స్త్రీలే ఎక్కువ పాల్గొనటం వాస్తవమే. అయితే ఆ మధ్య కృష్ణా జిల్లాలో 90శాతం పురుషులు పాల్గొన్న సందర్భాలూ ఉన్నాయి. యువత మధ్యాహ్న సమయం సత్సంగాలకు ఆశించలేం. వారు స్కూళ్ళు, కాలేజీలలో ఉంటారు కదా? వీరు సేవలో పాల్గొంటారు.

**ప్ర: సత్సంగాల ద్వారా మీరు సాధించింది ఏమిటి?**

జ: పాజిటివ్ థింకింగ్ పెరిగి, ఇంటిలోని సమస్యలను పరిష్కరించుకునే మనోధైర్యం వారికి కలుగుతుంది. శ్రవణం, మననం కారణంగా, కుటుంబాలలో శాంతియుత జీవనానికి ఈ సత్సంగాలు బాటలు వేస్తున్నాయి.

**ప్ర: రమణ భాస్కర పత్రిక ఎప్పుడు ప్రారంభించారు? ఈ ప్రతికకు చదువరుల ఆదరణ ఎలా ఉన్నది?**

జ: రమణ భాస్కర పత్రికను 15 సంవత్సరాల క్రితం ప్రారంభించాం. గతంలోనూ, ఈ రోజుకీ కూడా అనేకులైన భక్తులు నేను ప్రసంగాలు ఇస్తున్నప్పుడు వ్రాసుకొని, వ్రాత ప్రతులను భద్రపరచుకొని, ఎంతో మందికి తెలియజేస్తుంటారు. వీటికి



అక్షర రూపమే రమణ భాస్కర పత్రిక. ఇక ఆదరణ అంటారా, అమోఘం! మాటలలో చెప్పేది కాదని 'రమణ భాస్కర' పత్రిక ప్రింట్ ఆర్డర్ రెండు వేలే అయినా, చదివే వారి సంఖ్య 10 వేల పైనే. పత్రిక రాక కోసం పడిగాపులు ఓ పక్క అయితే, మరో వైపు ఈ పత్రిక గైడ్ అండ్ ఫిలాసఫర్‌లా వ్యవహరిస్తుందనటంలో ఏమాత్రం సంకోచం లేదు. పలువురు స్వానుభవాలను వ్యక్తిగతంగా తెలియజేసారు. మచ్చుకి రెండే రెండు ఉదాహరణలు. ఓ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ తన కుమారుణ్ణీ, కోడలినీ, రోడ్డు ప్రమాదంలో పోగొట్టుకున్నారు. ఈ విపత్కర సంఘటనతో శోక సముద్రంలో మునిగిన ఈమె, రమణ భాస్కర పత్రిక చదివి దుఃఖ నివృత్తురాలైనది. ఎండగండి గ్రామ వాసి, తన ఆప్తులను కోల్పోయి దుఃఖంతో పరితపిస్తుంటే, వారికి సమీప బంధువు చదవమని ఇచ్చిన రమణ భాస్కర పుస్తకం, వారికి మనో నిబ్బరాన్ని కలిగించి మనఃశాంతిని ప్రసాదించింది. ఇలా పలువురు, తమకు రమణ భాస్కర పుస్తకం చదవడం ద్వారా జరిగిన మేలును పలుచోట్ల స్వయంగా తెలియజేసారు. చేస్తున్నారు కూడా.

**ప్ర: విదేశాలలో రమణ వాణిని ఎలా వినిపిస్తున్నారు?**

జ: అమెరికాలో నాన్నగారు డాట్ కామ్ వెబ్ సైట్‌ను ప్రారంభించి, అరుణాచలం, జున్నూరులో ఉన్న అనుభూతిని స్వయంగా పొందటం కాక, పలువురికి రమణ బోధనలను తెలియజేస్తున్నారు.

**ప్ర: అకర్మలో కర్మ, కర్మలో అకర్మ - వివరణ ఇస్తారా?**

జ: అహంకారం లేకుండా చేసేదే 'అకర్మ'.

**ప్ర: భగవంతునికీ, భక్తునికీ మధ్య ఏజెంట్ అవసరమా?**

జ: భగవంతునిలో ఐక్యం కావటానికి గురువు అవసరం. నిజమైన గురువు లోపలే. బాహ్యమైన గురువు అంతర్ముఖం చేస్తాడు. మనస్సును తనలో ఐక్యం చేసి మనోనాశనం చేసి తన స్వరూపాన్నిస్తాడు.

**ప్ర: స్వాత్మానుభూతి అంటే?**

జ: స్వాత్మానుభూతి ఉన్నది ఒక్కటే. ఆత్మసత్యం, అనంతం బ్రహ్మం, జ్ఞానం,

ఈశ్వరుడు, శక్తి పర్యాయపదాలు.

**ప్ర: మరి స్వస్వరూపజ్ఞానమంటే?**

జ: ఆత్మజ్ఞానానికి మరో పేరు స్వస్వరూపం. స్వరూపం అరూపమే.

**ప్ర: ఆత్మబిందు దర్శనం ఎలా?**

జ: పరమాత్మగా ఉండగలగటం. ఆత్మలో ఉండగలిగితే భగవంతుని పేరే ఉండటం I am that. అగ్నిని వేడిని విడదీయలేం. దాని స్వరూపమే అనంతం, ఆనందం. ఆత్మానుభవం పొందినవానికి చావుకీ, జీవితానికి భేదం కన్పించదు. భేదభావన ఉండదు. ప్రపంచాన్ని తన కంటే భిన్నంగా చూడదు. భయం ఉండకపోతే దుఃఖం ఉండదు. దుఃఖ కారణం, లోపల అజ్ఞాన రూపంలో ఉంది. దేహాభిమానం నశిస్తే దుఃఖం లేదు. దుఃఖరహితుని చేయడమే లక్ష్యం.

**ప్ర: పిపీలికాదిబ్రహ్మపర్యంతం శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నప్పుడు జ్యోతిషం అవసరం ఏముంది?**

జ: ఈశ్వర సంకల్పం ప్రకారం అంతా జరుగుతుంది. తనువు తాను కాదని తెలిసినవాడికి జపమలే, తపమేల? జ్యోతిషం దేహగతమే.

**ప్ర: 'మౌనం' ప్రాధాన్యం ఏమిటి?**

జ: మనస్సు శాశ్వతంగా అణగిపోతుందో శక్తిమంతం, శాంతి, Silence in Golden. వాక్కు కంటే శక్తివంతమైనది. జ్ఞాన పూరితమైనది. మౌనానికి పరిమితులు లేవు. వాక్కుకు, మనస్సుకూ పరిమితులున్నాయి. ధ్యానమౌనం అనేక జీవితాలను తీర్చిదిద్దింది. సత్యం వైపు ముఖాన్ని మళ్లిస్తుంది. మనోదేహాలు అతీతంగా ఏదో ఒక సద్వస్తువును స్పృశింపచేస్తుంది. తెలుసుకోవాలనే జిజ్ఞాసను ఉదయింపచేస్తుంది.

**ప్ర: వ్యక్తి నుండి సమిష్టిని వివరిస్తారా?**

జ: స్వప్రయత్నం, కాలపక్వం, ఈశ్వర కటాక్షం అవసరం. జ్ఞాని అంతా తానే అనుకుంటాడు. చేతలో కానీ, మాటలో కానీ, తలంపులో కానీ, వ్యక్తి భావన ఉండరాదు. వ్యక్తి భావన నశించకుండా, దేహబుద్ధి నశించకుండా, ఆత్మబుద్ధి కలగదు. ఆత్మబుద్ధి లేనివాడికి సమష్టి భావన ఉండదు. ఆత్మ బుద్ధి కలవాడు తన కంటే భిన్నంగా లోకాన్ని చూడడు. అదే సమష్టి భావన.

**ప్ర: ఆత్మవిచారణ ఎందుకు చెయ్యాలి?**

జ: మనిషికి సుఖం కావాలి. లోకంలో సుఖం ఎక్కడా లేదు. మానవుడు ఉందనుకుంటాడు. సుఖం లేని చోట ఎంత కాలం వెతికినా దొరకదు. మనిషి హృదయంలో ఆత్మ ఉన్నది. ఆత్మలోనే సుఖం ఉన్నది. ఆత్మను తప్పించి సుఖం ఎక్కడా లేదు. ఆత్మకు మరోపేరు దైవం. మానవుడికి తన స్వరూపమైన సుఖం అందేవరకూ, ఆత్మను అన్వేషించాలనుకుంటాడు. నూటికి నూరుపాళ్లూ స్వతంత్రమైన సుఖం అనుభవంలోనికి వచ్చినవాడికి, లోకానికి సంబంధించిన తలంపులూ, దైవ సంబంధితమైన తలంపులూ రానే రావు. లోకం లేకపోతే దేవుడు లేడు. దేహం లేకపోతే లోకం లేదు. మనసు లేకపోతే దేహం లేదు, నేననే తలంపు లేకపోతే మనస్సు లేదు. నేననే తలంపు ఎక్కడ నుంచి వస్తుందో దాన్నే హృదయమంటారు. ప్రపంచం కథ అంతా హృదయంతో ముగిసిపోవలసిందే!



**ప్ర: సాక్షీభూతమైన జీవితం అంటే ఏమిటి?**

జ: ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అదే ఆత్మ. అది తానే ఉన్నాడు. ఆత్మసాక్షి అంటాడు. దాని చేతిలో ఆత్మ చేతిలో పని ముట్టుగా పనిచేయడమే ఆత్మసాక్షి

రమణ సత్సంగం 'ఎక్కడ' జరుగుతుందో అక్కడ అరుణాచల తిరువణ్ణామలై జ్యోతి వెలుగుతుంది. ఆ దివ్య ప్రకాశంతో చీకట్లు దూరం అవుతాయి. కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రభ మాజీ సంపాదకులు, నాన్నగారి గురించి ఇలా అంటారు.

"శ్రీ నాన్నగారి ప్రతీ మాట భావగర్భితమైన ఒక ఆధ్యాత్మిక నినాదం. ముముక్షువులకు దివ్యసోపానం. సుదీర్ఘ భాష్యాలు. వ్యాసాల రూపంలో కంటే ప్రజల హృదయాలను హత్తుకొనే సూక్తుల రూపంలో ప్రవచించటం శ్రీ నాన్నగారి ప్రత్యేకత. వీరి సూక్తులలో సాహిత్య పుష్టి ఉంది. వారి అమృత వాక్కులు జిజ్ఞాసువులను మాత్రమేగాక సాహిత్యాభిమానులను సైతం ఆకర్షిస్తాయి".

ఆత్మ సాక్షాత్కారం పొందిన రమణ మహర్షి దివ్యమైన మౌనానికి సంభాషణలను, నాన్నగారు, ఆంధ్రావనికే కాక దేశ విదేశాలలోనూ అందిస్తున్నారు. అవి శ్రాంత పర్యటనలతో అమృతధారను నాన్నగారు అందిస్తుంటే, ఆలిచిప్పలు కూడా ముత్యాలుగా రూపాంతరం చెందుతాయి.

(25, జూన్ 2006 ఆదివారం ఆంధ్రప్రభ పత్రిక ఆధారంగా)

Designed at : Ananya Graphics, Palakol, 9397151342